## ఎగ్జిబిషన్ ప్రారంభం

బొల్లారం, మార్చి 22: ఫ్యాషన్ లైఫ్ యువతకు హాబీ గా మారిందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం బోయిన్ పల్లి లోని గాయత్రి గార్డెన్ లో ఏర్పాటు చేసిన క్లాసీ క్లోసెట్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ ఎగ్జిబిషన్ లో వెరైటీ డ్రెస్సులు, జ్యువెల్లరీ, హోం మేడ్ వంటకాలు, ఆర్గానిక్ కూరగాయలు, పండ్లతో కూడిన సుమారు 66 స్టాల్స్ ను ఏర్పాటు చేశారు. స్టాల్స్ అన్నింటిని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తిరిగి పరిశీలించారు.

## ఎల్వోసీ అందజేత


ఎల్వోసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సికింద్రాబాద్, మార్చి 22 : నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలను పొందేందుకు తమ వంతు సహకారాన్ని అందిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. పార్సిగుట్ట కు చెందిన కమ్మగాని అనసూయ కు రూ.75 వేల ఎల్వోసీ పత్రాన్ని శనివారం సీతాఫల్ మండి లోని తన కార్యాలయంలో అందించారు.వైద్య సేవలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నాని పేర్కొన్నారు. లో బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందు..



సికింద్రాబాద్, మార్చి 22: ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. వారాసిగూడ లోని జామ్ జామ్ ఫంక్షన్ హాల్ లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పద్మారావు గౌడ్ పాల్గొని ప్రసంగిస్తూ ముస్లింలు ఉపవాస దీక్షలను పవిత్రంగా భావిస్తారని అన్నారు. యువ నేత రామేశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్‌లు అందజేత

ముషీరాబాద్, మార్చి 22: పేద విద్యార్థులకు ఆర్థిక చేయూతనిస్తూ ఉన్నత విద్య అభ్యసించడానికి బాసటగా నిలవాలని వివేకానంద డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. మలబార్ గ్రూప్ ఆధ్వర్యంలో శనివారం వివేకానంద డిగ్రీ కళాశాల విద్యార్థినులకు ఉపకార వేతనాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని 2024-25 సంవత్సరానికి గాను 83 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. మలబార్ స్కాలర్‌షిప్ కాలేజీ కోఆర్డినేటర్ అనుపమ, మలబార్ గ్రూప్ నిర్వాహకుడు సయ్యద్ ముజీబ్, మేనేజర్ విజయ్ పాల్గొన్నారు.

# వస్త్రాలను సమర్పించడం అభినందనీయం


ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ధారాలను అందజేస్తున్న అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులు

బేగంపేట్ మార్చి 22: సీతారాముల కల్యాణం సందర్భంగా ప్రతి సంవత్సరం వస్త్రాలను సమర్పించడం ఎంతో సంతోషదాయకమని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్ పల్లిలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అఖిల భారత చేనేత కళా వైభవం సభ్యులు కలిశారు. వస్త్రాల తయారీ కోసం ఉపయోగించే ధారాలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు అందజేశారు. ఈ ధారాలకు సికింద్రాబాద్ లోని గణేశ్ టెంపుల్ లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భద్రాచలం తీసుకెళ్లనున్నట్లు వివరించారు. భద్రాచలం ఆలయ ఆవరణలో ఎంతో నిష్ఠతో ఈ నెల 25 వ తేదీ నుంచి రాముడు, సీతా, లక్ష్మణుడు, ఆంజనేయుడికి వస్త్రాలను మగ్గం పై నేయడం జరుగుతుందని వివరించారు. మగ్గం పై నేసిన పోచంపల్లి వస్త్రాలను ఏప్రిల్ 6 వ తేదీన భద్రాచలంలో నిర్వహించే కల్యాణంలో శ్రీ సీతారాములుకు అలంకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ జయరాజ్, సభ్యులు రాపోలు గణేశ్, సురేందర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందుతో ఐక్యత


ఎమ్మెల్యే తలసానికి పండ్లు తినిపిస్తున్న సయ్యద్ నుమానుద్దీన్

అమీర్‌పేట్, మార్చి 22 : ఇఫ్తార్ విందులు ఐక్యతను చాటుతాయని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం సనత్ నగర్ డీఎన్ఎమ్ కాలనీలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు చెబుతూ, పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ జామా మసీద్ జాఫరి అధ్యక్షులు సయ్యద్ నుమానుద్దీన్, రహీం, బీఆర్ఎస్ నాయకులు ఖలీల్, జమీర్, అబ్రార్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

# నిధుల కొరతతో కుంటుపడిన అభివృద్ధి


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 22: నిధుల కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి కుంటుపడిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగిపోవడమే ఇందుకు కారణమని విమర్శించారు. శనివారం అడిక్ మెట్ డివిజన్ నాగమయ్య కుంట, బాపూజీ నగర్ శ్మశాన వాటికలో 78 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ తో కలిసి ప్రారంభించారు. డ్రైనేజీ పైపులైన్, శ్మశానాటిక అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ఒక లక్ష్యం అంటూ లేకుండా పోయిందని, బస్తీల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమాన్ని విస్మరిస్తున్నారన్నారు. అభివృద్ధి పనుల ఊసే త్తడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, కార్పొరేటర్లు సుప్రియ నవీన్ గౌడ్, రవి చారి, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులు ప్రారంభం..**

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతి నగర్ బస్తీలో శనివారం సాయంత్రం రూ. 20 లక్షల రూపాయలతో వీడీసీసీ రోడ్డు పనులు, మరో రూ.10 లక్షలతో మంచినీటి పైప్ లైన్ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరై, ఎమ్మెల్యే ముఠా గోపాల్, స్థానిక కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ లతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, నాయకులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి



పాల్గొన్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు

అడ్డగుట్ట, మార్చి 22 : అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్ నగర్ లో బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శనివారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం అమలుపై చర్చించారు. అనంతరం ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఏవీఎం స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సరిపడా మౌలిక సదుపాయాలను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, ప్రవీణ్, సీపీఐ నేత కాంపల్లి శ్రీనివాస్ కొమురయ్య, లక్ష్మి, బాలమణి, ఎంవీ ఫౌండేషన్ కోఆర్డినేటర్లు సువర్ణ, భాగ్య, లావణ్య ,సుమలత పాల్గొన్నారు.

## ప్రపంచ సుందరి పోటీలను రద్దు చేయాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి లక్ష్మి

చిక్కడపల్లి, మార్చి 22:పెట్టుబడి దారుల మార్కెట్ ప్రయోజనాల కోసం ప్రపంచ సుందరి పోటీలు నిర్వహిస్తున్నారని, పోటీలను రద్దు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో వీరనారి ఐలమ్మ ట్రస్ట్ భవనం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ సుందరి పోటీలను మే 7న ప్రారంభించి 31న గ్రాండ్ ఫినాలేతో ముగించనున్నట్లు, విభిన్నమైన కళా వారసత్వం ఉన్న తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలను స్వాగతిస్తున్నామని అంతర్జాతీయ వేడుకలకు హైదరాబాద్ వేదిక అవుతున్నందుకు ఆనందంగా ఉన్నదని పర్యాటక సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి (ఐఏఎస్) అధికారి స్మితా సబర్వాల్ మాట్లాడటం విచారకరమన్నారు. ఈ పోటీలు పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే, మరోపక్క దేశంలో, రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, మహిళలపై హింస పెరుగుతున్నది. మహిళలకు రక్షణ కల్పించాల్సిన పాలకులు అంతర్జాతీయ వేడుకలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కేఎన్ ఆశలత, రాష్ట్ర కోశాధికారి మాచర్ల భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యా రంగంలో ఏఐ పాత్ర కీలకం



సదస్సులో పాల్గొన్న హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

చిక్కడపల్లి, మార్చి 22: ఉన్నత విద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పాత్ర కీలకమైందని హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కళాశాలలో శనివారం ఉన్నత విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పాత్ర అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి హాజరై మాట్లాడుతూ ఉన్నత విద్య రంగంలో ఏఐ పాత్ర కీలకమైనదన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ సరోజ వివేక్, ప్రొఫెసర్ అమన్ దీప్ కౌర్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మట్టా శేఖర్ , డైరెక్టర్ ప్రొఫెసర్ రామకృష్ణ ,అసిస్టెంట్ ప్రొఫెసర్ రాధిక , ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, రూప పాల్గొన్నారు..

## బిల్లు ఆమోదంపై హర్షం


మందకృష్ణ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కవాడిగూడ, మార్చి 22: అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పొందడం గొప్ప విషయమని ఎమ్మార్పీఎస్ నాయకులు గండికృష్ణ, ఎంఎస్పీ నాయకుడు గజ్జల రాజశేఖర్ మాదిగ అన్నారు. అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా భోలక్‌పూర్ డివిజన్ ఇన్‌చార్జి దశరథ్ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలకకెల్లయ్య, సత్యనారాయణ, నందగిరి నర్సింగ్‌రావు, వెంకటయ్య, వినయ్‌కుమార్, రాములు, రోషన్ వినాయకరావు, ఎల్లయ్య, హరిబాబు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షానికి కూలిన ఇంటి పైకప్పు


మెట్టుగూడలో విద్యుత్ పునరుద్ధరణ పనులను చేయిస్తున్న కార్పొరేటర్ సునీత

అడ్డగుట్ట, మార్చి 22: అడ్డగుట్ట సీ సెక్షన్ లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటి పైకప్పు కూలింది. సీ సెక్షన్ లో శామ్యూల్, పోచమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరితోపాటు శామ్యూల్ కుమార్తె కృష్ణవేణి, వారి పిల్లలు కూడా ఉంటున్నారు. అయితే భారీ వర్షానికి ఇంటి పైకప్పు కూలడంతో కృష్ణవేణికి పిల్లలకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం బీఆర్ఎస్ నాయకులు, మారేడ్ పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ తో కలిసి ఇంటిని పరిశీలించారు. బాధితులకు కార్పొరేటర్ ఆర్థిక సాయం చేయడంతో పాటు విషయాన్ని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ దృష్టికి తీసుకెళ్లి బాధితులకు మరింత న్యాయం జరిగేలా చూస్తానని తెలిపారు. మారేడ్ పల్లి తహసీల్దార్ భీమయ్య గౌడ్ బాధితుల వివరాలను తీసుకొని గాయాలైన వారిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

**మెట్టుగూడలో...** మెట్టుగూడలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపోయాయి. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ రాసూరి సునీత అధికారులను అప్రమత్తం చేసి చెట్ల తొలగింపు తో పాటు విద్యుత్ పునరుద్ధరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని ఆమె కోరారు. భారీ వర్షానికి ఆలుగడ్డ బావి, చిలకలగూడ చౌరస్తా, హనుమాన్ టెంపుల్ తో పాటు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచి పోయిందని, విద్యుత్ అధికారులను అప్రమత్తం చేసి పునరుద్ధరణ పనులనువేగవంతం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

# ముగిసిన సమన్వయ ఉత్సవాలు



బన్సీలాల్ పేట్, మార్చి 22 : బిజినెస్ మేనేజ్‌మెంట్ రంగాన్ని ఎంచుకున్న యువతకు ప్రస్తుతం అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని, కొత్త ఆలోచనలతో చేసే వ్యాపారాలు, నూతన ఆవిష్కరణలకు మార్కెట్ లో స్వాగతం లభిస్తుందని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ విభాగం హెచ్ఓడి ప్రొఫెసర్ వై.జహంగీర్ అన్నారు. పద్మారావు నగర్ లోని సర్దార్ పటేల్ కళాశాల బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు సమన్వయ పేరుతో నిర్వహించిన ఉత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమర్నాథ్ శర్మ, ఎంబీఏ డైరెక్టర్ డాక్టర్ అనుప యాదవ్, హెచ్ఓడి.పల్లవి, రాహుల్ యాదవ్ పాల్గొన్నారు.

# ఉచిత శిక్షణ..ఉపాధి అవకాశాలు

అమీర్‌పేట్ మార్చి 22 : టెక్ మహీంద్రా ఫౌండేషన్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్ వేర్ హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ నిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ డిప్లమా ఐటిఐ డిగ్రీలు విద్యార్హతలుగా ఉంటాయని, అభ్యర్థుల వయసు 18 నుంచి 35 లోపు ఉండాలని, ఈ కోర్సులకు సంబంధించిన క్లాసులు మార్చి మొదటి వారంలో ప్రారంభమవుతాయని, కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని ముఖ్యంగా మహిళలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వివరాలకు ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న (మెట్రో పిల్లర్ నంబర్ ఏ 980 ) సనత్ నగర్ సెయింట్ థెరిసా చర్చి కాంపౌండ్ ఆవరణలో ఉన్న టెక్ మహేంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయం లో 7337332608 నంబర్‌లో సంప్రదించాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి కోరుతున్నారు.

# అందుబాటులోకి డిజిటల్ గ్రంథాలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు, సావనీర్లు అందజేస్తున్న నిర్వాహకులు

సికింద్రాబాద్, మార్చి 22: తెలుగు భాషా సంస్కృతిని డిజిటల్ మాధ్యమంలో స్థిరపరిచే దిశగా మరో ముందడుగుపడింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, నిజాం కళాశాల తెలుగు శాఖ, బోలిచేతో ఫౌండేషన్ ల సంయుక్త ఆధ్వర్యంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల వికీసోర్స్ కార్యశాల విజయవంతంగా నిర్వహించారు. తెలుగు శాఖ విద్యార్థులు, అధ్యాపకులు, వికీపీడియా ప్రాజెక్టులపై ఆసక్తి ఉన్న వ్యక్తులు పాల్గొన్నారు. వికీసోర్స్ గురించి అవగాహన కల్పించడం, పబ్లిక్ డొమైన్ గ్రంథాలను డిజిటల్ రూపంలో ప్రజలకు అందుబాటులోకి తేవడం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించారు. మొదటి రోజు ఉదయం కార్యక్రమాన్ని ఓయూ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బోలిచేతో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేతి సాయికిరణ్ , బుజ్జాయి టెక్నాలజీస్ వ్యవస్థాపకులు రహ్మానుద్దీన్ , ముఖ్య అతిథిగా ఆర్ట్స్ కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య సి.కాశీం , గౌరవ అతిథిగా ప్రముఖ వికీపీడియన్ రహ్మానుద్దీన్ , ఉస్మానియా తెలుగు శాఖ పాఠ్య ప్రణాళిక సంఘం అధ్యక్షులు డా ఏలె విజయలక్ష్మి , సహాయాచార్యులు డా.ఎస్. రఘు , ప్రముఖ వికీ సోర్స్ ఎడిటర్ రామేశ్వరం , నిజాం కళాశాల అధ్యాపకులు డా. ఎస్. చంద్రయ్య పాల్గొని, వికీ సోర్స్ ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వికీసోర్స్‌లో లాగిన్ విధానం, ఓ సి ఆర్ టూల్ ఉపయోగం, పేజీ ప్రమాణీకరణ వంటి అంశాలను నేర్చుకున్నారు.

# క్షయ నివారణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం

బన్సీలాల్‌పేట్, మార్చి 22 : తెలంగాణలో క్షయ వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు కృషి చేస్తున్నామని, అందరి సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని నేషనల్ హెల్త్ మిషన్, సీనియర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ అన్నారు. 'ప్రపంచ టీబీ దినం' సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీలోని ఆలుమ్ని హాలులో శనివారం 'వరల్డ్ టీబీ డే - 2025' వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం తెలంగాణ (టీబీ) జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రాజేశం మాట్లాడుతూ 2024లో తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలలో ప్రయోగాత్మకంగా టీబీ నిర్మూలన చర్యల్లో 91 శాతం ఉత్తమ ఫలితాలను సాధించామని అన్నారు.

## కవాడిగూడలో ఫుట్‌పాత్ గోడను కూల్చిన హైడ్రా



కవాడిగూడ, మార్చి 22: కవాడిగూడ డివిజన్ పరిధిలోని ఎల్బీనగర్ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ప్రహరీని ఆనుకొని రోడ్డుకు అడ్డంగా ఉన్న ఫుట్‌పాత్ గోడను తొలగించాలని ఫిర్యాదు చేసిన 48 గంటల్లోనే హైడ్రా అధికారులు స్పందించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు హైడ్రా అధికారులు శనివారం సిబ్బందిని పంపించి గోడను బుల్డోజర్ తో తొలగించారు. అనధికార పెన్సింగ్‌తో పాటు రోడ్డుకు అడ్డంగా ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగించారు. కవాడిగూడ మెయిన్‌రోడ్ నుంచి ఎల్‌బీనగర్, కిందిబస్తీ, బాంబే బిల్డింగ్ తదతర ప్రాంతాలకు రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారు.

# రాష్ట్రపతి నిలయంలో నీటి దినోత్సవం

బొల్లారం, మార్చి 22: వర్షచక్రం ద్వారా నీటి వనరులను తిరిగి నింపడం ప్రకృతి మార్గమని ప్రొఫెసర్ జీకే విశ్వనాథ్ అన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారం రాష్ట్రపతి నిలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వనాథ్ జేఎన్టీయూ ప్రొఫెసర్, సాహే సంస్థ వ్యవస్థాపకురాలు కల్పన రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. వర్ష చక్రం ద్వారా నీటి వనరులను తిరిగి నింపడం ప్రకృతి మార్గమని, అవపాతం యొక్క కీలకపాత్రను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో నిలయం అధికారిణి రజనీ ప్రియ, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


## 'ఏక కాలం ఎన్నికలతో మేలు'

ముషీరాబాద్, మార్చి 22: ప్రకాశం అధ్యయన అభివృద్ధి సంస్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభ లోని ఒకే దేశం ఒకే ఎన్నిక అంశం పై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది నారపరాజు రామచంద్ర రావు మాట్లాడుతూ దేశం పార్లమెంట్ కు రాష్ట్రాలలోని శాసన సభలకు ఏక కాలం లో ఎన్నికలు నిర్వహించటం వల్ల ప్రభుత్వ నిధుల పొదుపుల చేయవచ్చు అన్నారు. సంస్థ చైర్మన్ డాక్టర్ పి మోహన్ రావు, కార్యదర్శి నిరంజన్ దేశాయి, సూర్య ప్రకాశ్, రామ్మోహన్ రెడ్డి, రాజ శేఖర్ గుండల్ రెడ్డి, చంద్ర శేఖర్ పాల్గొన్నారు

## కనీస వేతనాల జీవోను సవరించాలి

కవాడిగూడ, మార్చి 22: పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల జీవోలను వెంటనే సవరించాలని తెలంగాణ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనాల సవరణకు ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకులు బాలరాజ్, బీఆర్ఎస్‌కేవీ నాయకుడు రాంబాబు, ఎండి.యూసుఫ్, టీయూసీఐ నాయకులు సూర్యం, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్, హెచ్ఎంఎస్ నాయకులు రెబ్బరామారావు, ఐఎఫ్‌టీయూ నాయకురాలు ఎస్.ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1948 కనీస వేతనాల చట్టం ప్రకారం డీఏ లింకప్ అయిన జీవో లను ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సవరించి జీవోలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు వెంకటేశ్, కిషన్, శ్రీనివాస్, అనురాధ, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, ఎం.కె.బోస్ తదితరులు పాల్గొన్నారు.

## శాలివాహన చక్రవర్తికి నివాళి


నివాళులర్పిస్తున్న సంక్షేమ సంఘం నాయకులు

కవాడిగూడ, మార్చి 22: బహుజన వీరుడు శాలివాహన చక్రవర్తి జయంతి, వర్ధంతిలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని శాలివాహన ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గౌరీపతి కోరారు. శాలివాహన జయంతిని పురస్కరించుకొని శనివారం ట్యాంక్‌బండ్‌పైన ఉన్న విగ్రహానికి సంఘం నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సుదర్శన్, మోహన్‌రావు, ప్రవీణ్ పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టాలి

చిక్కడపల్లి, మార్చి 22: వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మహిళా వికలాంగుల సాధికారత-సంక్షేమం అనే అంశంపై శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు సాయమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతి మాట్లాడుతూ మహిళా వికలాంగుల సాధికారత, విద్యా, స్వయం ఉపాధి, ఆరోగ్యం, భద్రత,రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం కల్పించే లక్ష్యంతో 1975 నుంచి ఐక్య రాజ్య సమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు.హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మన్ ఉమర్ ఖాన్, వీఆర్సీ మాజీ డైరెక్టర్ గంగా ధర్,రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు వరమ్మ,తెలంగాణ సాహితీ రాష్ట్ర ఉపా ధ్యక్షురాలు సలీమ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి పాల్గొన్నారు

## పేదలకు ఉచిత వైద్యం అందించాలి


పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, మార్చి 22: పేదలకు ఉచిత వైద్యం అందించడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం విద్యానగర్ ఎస్ ఆర్ టీలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పావని, డాక్టర్ అర్జున్, డాక్టర్ మన్మోహన్, బీఆర్ఎస్ నేత ముఠా జయసింహ, కే సురేందర్, అనురాధ, పీఆర్టీ అధ్యక్షుడు యాదగిరి, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారం

ముషీరాబాద్, మార్చి 22: రాంనగర్ సీతారామచంద్ర స్వామి దేవాలయం ధర్మకర్తల మండలి సభ్యులు శనివారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ ధర్మకర్తలుగా ఆనంద్ ముదిరాజ్, గోవర్ధన్ రెడ్డి, మీనా, రామచంద్ర, యాదగిరి, ప్రశాంత్‌లను ఈవో లక్ష్మారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా ఆనంద ముదిరాజ్ ను ఎన్నుకున్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ కార్పొరేటర్ కల్పన యాదవ్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన

ముషీరాబాద్, మార్చి22: వ్యాస కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రపంచ నాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం త్యాగరాయ గాన సభలో శ్రీకృష్ణ రాయబారం లోని శయన దృశ్యం, రామాంజనేయ యుద్ధం నాటకాన్ని ప్రేక్షక రంజకంగా ప్రదర్శించారు. కృష్ణుడిగా కిశోర్ కుమార్, దుర్యోధనుడిగా శ్రీనివాసు, అర్జునుడిగా దొంతి జంగయ్య గౌడ్ వివిధ పాత్రల్లో నాటకాన్ని రక్తి కట్టించారు. ఈ కార్యక్రమంలో వేదవ్యాస్, వెంకటేశ్, భాస్కర రావు, క్రాంతి కుమార్, సాంబ శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

బొల్లారం, మార్చి 22: పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షల్లో ఉండే ముస్లింల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు, ఆత్మీయత మత సామరస్యానికి ప్రతీక అని బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు, శ్రీనివాస్, టింకు గౌడ్ అన్నారు. కంటోన్మెంట్ ఒకటో వార్డు న్యూ బోయినపల్లి కడక్ పురా బస్తీలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అమీర్ భాయ్, మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి, ఎస్సై నాగేందర్, శివశంకర్ పాల్గొన్నారు

## కుల గణన చేపట్టాలి

చిక్కడపల్లి, మార్చి 22: దేశవ్యాప్తంగా కుల గణనచేపట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సమాజ్వాది పార్టీ అడ్వకేట్ ఫోరం జాతీయ అధ్యక్షుడు కృష్ణ కన్నయ పల్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు రవి కుమార్ బాఫేల్ ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ కన్నయ్య పల్ మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర హైకోర్టు న్యాయవాది వంశీకృష్ణ, ప్రొఫెసర్ తాటిండ వెంకట రాజయ్య, అక్కల బాబు గౌడ్ పాల్గొన్నారు